


# జూదరి

ఒకే ఒక పందెంలో ఆకస్మాత్తుగా నూరు దీనారాలు గెలుచుకున్నాడు ముక్కంటి! ఆ పందెంలో అతడు ఒడ్డిన దీనారాలు పది మాత్రమే! అయితే నేమి, బాగా అదృష్టం కలిసివచ్చి, పది రెట్లు ఎక్కువ దీనారాలు చేజిక్కించుకున్నాడు. ఎంతో కాలంనించి జూదం ఆడుతున్నా, అంతటి పెద్ద మొత్తం ఎప్పుడు అతని చేతిలో పడలేదు! ఆ సంతోషం పట్టలేక, గెలిపించిన పాచిక చేత దొరకబుచ్చుకుని మాటిమాటికి ముద్దుపెట్టుకున్నాడు!



...కాంసా అవి ముక్కులతో పొడిచి, పొడిచి ఇట్టే హరించి వేస్తాయి! ఆ దేవిని సందర్శించి ప్రాణాలతో బయటపడినవారిని వేళ్ళమీద లెక్కపెట్ట వచ్చును! అయితే, ఆ దేవతామూర్తి సందర్శన భాగ్యం సాధించుకున్న వ్యక్తుల ఎంతటి గొప్ప కోరిక అయినా నెరవేరనివా రెవ్వరూ లేరు! అది తాత ముత్తాతల కాలంనించి పద్మపురంలో అనుశ్రుతంగా వినవస్తున్న సంప్రదాయ గాథ. అదే వృత్తాంతం పద్మస్వామి ముక్కంటికి సంగ్రహంగా వెల్లడించాడు.

"నేనీ సంగతి ఇంతకు మునుపే కొందరు పెద్దలవల్ల విన్నాను గాని — అయితే, అది అంతా అక్షరాలా నిజమేనా? లేక గోరంతలు కొండంతలు చేస్తున్నావా?" తీవ్ర జిజ్ఞాసతో ప్రశ్నించాడు ముక్కంటి.

"ముమ్మాటికీ నిజం! ఆ భీకర కీటకాల పాట ఎంత యథార్థమో, ఆ దేవత సందర్శనం వల్ల ఏ మేదయినా సిద్ధించి తీరుతుందన్న మాట కూడా అంతే యథార్థం! అయితే, అక్కడికి పోయి, మరి ప్రాణాలతో తిరిగి రావడం మాత్రం చాలా కష్టం! జాగ్రత్తగా ఆలోచించుకో!"

"నే నెలాగు బ్రతుకుమీద ఆశ వదులుకున్నాను గదా! పోనీ, ఆ దేవత దర్శనం కోసమే నా ప్రాణం విడుస్తాను! ఒక వేళ ఆ దేవి సందర్శనమే సాధ్యపడితే, అజీవితాంతము ఎడతెగని ఐశ్వర్యమే ఒక వరంగా సాధించుకుంటాను! లేకపోతే ఆ కీటకాలే నా ప్రాణం తీస్తాయి! అంతే గదా! ఏది ఏమయినా అప్పటితో నా ఈ పీడ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుంది! ఇంక నా కంతకన్న కావలసిం దేమిటి?"

అతని గొంతులో ప్రతిధ్వనించిన దృఢ నిశ్చయం గమనించి ఉసూరుమని నిట్టూర్చాడు పద్మస్వామి. అయినా, ఆత డిక తన పట్టు విడవడని పసికట్టి, ఆ కీటకాల బెడదనుండి తప్పించుకో డానికని ఉపాయాలు కొన్ని వివరించాడు. అయినా, ఆ ప్రాణాల కోరలనుండి తప్పించుకోవడం చాలా దుస్సాధ్యమని తిరిగి తిరిగి హెచ్చరించాడు. మరి ఆ దేవతా సందర్శనం మాటే తలపెట్టక తిన్నగా ఇంటికి తిరిగి రావలసిందని మరీ మరీ బ్రతిమాలుకున్నాడు. బ్రతికి ఉంటే బలుసాకు అయినా తినవచ్చునని ధైర్యం చెప్పాడు. కాని, ముక్కంటి వినలేదు. పోనీ, ఆ భీకర కీటకాలకయినా ప్రాణా లర్పించి తీరతానని భీష్మించుకుని కూర్చున్నాడు.

* * *

ఆ పైన పద్మస్వామి వద్ద మరి పది దీనారాలు బదులుగా తీసుకుని, ముక్కంటి తిన్నగా ఇంటికే తిరిగి వెళ్ళిపోయాడు. ఆ సొమ్ములో చాలా భాగం వెచ్చించి, ఇంటిల్లిపాదికి మరికొంత కాలందాకా అన్నవస్త్రాల కేవిధమయిన కొదవ రాకుండా ఏర్పాటు చేశాడు. అంతేగాని, కుటుంబంలోని వారి కెవరికీ తన దేవతా సందర్శనం మాట మాత్రమయినా వెల్లడించలేదు!

ఆ మరునాడు తెల్లవారుజామునే లేచి, ఎవ్వరికీ తెలియకుండా వేరొక చోటికి పోయి, మొట్టమొదటగా ముఖం తోపాటు తన ఒంటి కంతటికి గట్టి ఉక్కు కవచం బిగించుకున్నాడు. ఆ పైన దానిమీద దున్న చర్మంతో మలిచిన వేరొక కవచం బిగించు కున్నాడు. అయినా, అతని కింకా పూర్తిగా సంతృప్తి కలగలేదు. ఒంటిమీద తిరిగి నల్లరేగటి మట్టితో దట్టంగా ఒక అంగుళం మందాన గట్టిపూత పట్టించు కున్నాడు. అది బాగా ఆరిన తరవాత అలాగే ఇంకా రెండు పూతలు పట్టించు కున్నాడు. అప్పటి కతనికి పూర్తిగా సంతృప్తి కలిగింది.

ఆటుపిమ్మట "జయ! భ్రమర వాసినీ! జయ!" అని మూడుసార్లు ఎలుగెత్తి అరిచి, కాళ్ళు ఎత్తి ఎత్తి వేస్తూ తొందర తొందరగా వింధ్య పర్వతం దిశయన్నైపు సాగిపోయాడు.

ఆలాగ సుమారుగా అయిదామడల దూరం సాగిపోతేనేగాని, అతనికి ఆ వింధ్యపర్వత నివాసిని భ్రమరవాసినీదేవి సందర్శనం సాధ్యపడదు. ఆ పైన ఆ దేవళానికి స్పష్టంగా ఒక దారి, తెన్ను లేదు! అంతా కీకారణ్యం. దారినిండా చురకత్తులవంటి ముళ్ళ డొంకలు! మధ్య మధ్య ఘాతుక మృగాల పెడబొబ్బలు! అరుపులు! ఆవేళ సాయంకాలానికి అవలీలగా ఒక ఆమడ దూరం సాగిపోయి, ముక్కంటి ఒక పర్వత గుహలో కటిక చీకటిలో తల దాచుకున్నాడు. దారిలో దొరికిన అడవి పళ్ళేవో కొన్ని ఆరగించి, ఆ పక్కనే ప్రవహిస్తున్న కొండ కాలవ నీటితో దప్పిక తీర్చుకున్నాడు.

మరునాటి ఉదయమే తిరిగి ప్రయాణం ప్రారంభించేసరికి అతనికి అంతగా అలసట అనిపించలేదు. అంత వరకు ఆ భీకర కీటకాల జాడ కూడా అతని కెక్కడ గోచరించలేదు! కాని, గుబురు గుబురుగా, గజిబిజిగా అల్లుకున్న తరులతల మధ్యనుండి, మసక వెలుతురులో మరికొంత దూరం ముమ్మందుకు సాగిపోయేసరికి, పెద్ద జడివాన పడుతున్నట్టు ఒక పెనుసవ్వడి వినిపించింది. కాని, నిజాని కది జడివాన కానేకాదు! వేల కొలది శంఖపుష్ప కీటకా లొక్కుమ్మడిగా అతని శరీరంమీద విరుచుకుపడిన విపరీత ధ్వని!


మొట్టమొదట అవి అతని శరీరం మీది మట్టి తొడుగులు మూడు రంపాల పళ్ళవంటి ముక్కులతో పొడిచి, పొడిచి తుత్తునియలుగా విడదీసి వేశాయి! ముఖానికి తొడుక్కున్న కవచం చిన్న చిన్న కన్నాలలో నుండి ముక్కంటి ఆ భీకర జీవాల గుంపులపై పొక మారు చూశాడు. అంతే! అతని కాపైన విపరీతంగా భయం పట్టుకుంది! కాళ్ళు గజగజ వణికాయి! ఆ మట్టి తొడుగుల ధూళి కళ్ళలో పడిన ఆ కీటకాల గుంపులు కొన్ని వెనువెంటనే వెను దిరిగి పలాయనం చిత్తగించాయి!

కాని, మరికొన్ని గుంపు లంతలోనే తటాలున విరుచుకుపడి, అతని శరీరంమీద ఎడతెగని దాడి కొనసాగించాయి. అయినా అత డధైర్యపడలేదు. గుండె చిక్కబట్టుకుని మరింత వేగంగా పరుగు ప్రారంభించాడు. అలాగ మరి రెండామడల దూరం సాగిపోయేసరికి అతని శరీరం మీద మిగిలిన దున్న చర్మం కవచం కూడా ఆ భీకర జీవాల ధాటికి శకల శకలాలయి నేలమీద పడింది!

ఇక మిగిలినది రెండామడల దూరము,

అతని ఒంటిమీది ఉక్కు కవచము మాత్రమే! 'ఈ ఉక్కు కవచంతో నేను రెండామడల మేర ఇట్టే దాటిపోలేనా? ఎంతటి గట్టి ముక్కులుంటేనేమి, ఆ పురుగులీ కవచం ఛేదించగలవా? ఆఁ! పాడు కీటకాలు!' అనుకుని తనకు తానే గట్టిగా ధైర్యం చెప్పుకున్నాడు ముక్కంటి.

కాని, ఆటు పిమ్మట మరింత భీకరకారాలతో దండెత్తిన వజ్రపుచ్ఛ కీటకాల దాడితో అతని కవచం తప్పెటలా టట టటలతో ప్రతిధ్వనించింది. మరింత వేగంగా పరుగు పెట్టాడు. ఆ పరుగులో అతని కింక ఒంటిమీది స్పృహే సడలిపోయింది! మరికొంతసేపటికి ఆ ఉక్కు కవచం కూడా ఛిన్నాభిన్నమయి పోగలదేమో అన్న ఆందోళన ప్రారంభమయింది. మరింత త్వరితంగా పరిగెత్తాడు ముక్కంటి! అలాగ ఒక ఆమడ దూరం గడిచిపోయేసరికి అతని శరీరం మీది కవచానికి బాగా తూట్లు పడ్డాయి. ఇక మిగిలిన ఒకే ఒక ఆమడలో సగం దూరం గడిచిపోయేసరికి అతని ఉక్కు కవచం కూడా ఛిన్నాభిన్నమై నేలమీద పడిపోయింది! మరికొంతసేపటికి అతని ముఖ కవచం కూడా తుత్తునియలై పలువైపుల చెదిరిపోయింది!




ఇక మిగిలినది ఇంచుమించుగా ఆమడలో సగం దూరం మాత్రమే! మరింత విపరీత వేగంతో, ఇనుమడించిన భయంతో పరుగు ప్రారంభించాడాజాదరి! క్రమక్రమంగా ఆ కీటకాలతనిమీద తేనెటీగల గుంపుల్లా ముసురుకుని, శరీరంలోని కండలన్నీ కొరికివేశాయి! కళ్ళు రెండు చేతి వేళ్ళతో కప్పుకుని మరింత త్వరితంగా పరుగు సాగించాడు. అలాగ మరికొంత దూరం సాగిపోయేసరికి అతనికి భ్రమరవాసినీ దేవాలయం శిఖరం గోచరించింది. అందువల్ల అణగారిపోతున్న అతని ఆశ కొంత పుంజుకుంది. కాని అప్పటికే అతని శరీరంలో మిగిలిన రక్తమాంసాలా కీటకాలు పూర్తిగా ఆరగించివేశాయి! అప్పైన అడుగు పడడమే గగనమయిపోయింది. అయినా, కొనఊపిరి కూడదీసుకుంటూ, తన యావచ్ఛక్తి వినియోగించి, తూలుతూ, లేస్తూ అలాగే అతి కష్టంమీద అడుగులు వేసుకుంటూ ముమ్ముందుకు సాగిపోయాడు.

మరికొంతసేపటి కతనికి పూర్తిగా స్పృహ తప్పిపోతున్నట్టు, ప్రాణా లెగసిపోతున్నట్టు స్ఫురించింది. అయినా, అతి కష్టంమీద పది పన్నెండడుగులు వేసి ఆ దేవాలయం గర్భగృహంలో ప్రవేశించాడు. ఒకే ఒక క్షణ కాలంమాత్రమే భీషణ సింహవాహనం మీద సమాసీనురాలయిన భ్రమరవాసినీ దేవత మూర్తి అతని కట్టెదట సాక్షాత్కరించింది! అంతే! మరు నిమేషంలోనే ముక్కంటికి పూర్తిగా అపస్మారం కలిగింది. మరి కొంతసేపటివరకు అత డలాగే అవశుడై కూలబడిపోయాడు!

* * *


మరికొంతసేపటికి ముక్కంటికి తన నెమ్మేనిమీద అమృతం వలె చల్లనయిన హస్తంతో ఎవరో, ఎంతో ఆప్యాయంగా నిమిరి, నెమ్మదిగా తట్టి మేలుకొలుపుతున్నట్టనిపించింది! తటాలున కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చున్నాడు. శరీరం మీద ఎక్కడ ఒక్క చిన్న గాయమయినా కనిపించలేదు! అంతలోనే ఎదురుగా ఒక అతిలోక సౌందర్యవతి నిలుచున్నట్టు గోచరించింది! ఆ భీషణ సింహవాహనంమీద ఆ భ్రమరవాసినీదేవిగాని, ఆ దేవాలయంగాని, చుట్టూరా ఆ భీకరాటవి గాని అతని కిక కనిపించలేదు! ముక్కంటి మరి తన కన్నులనే నమ్మలేక పలువైపుల పరకాయించి చూశాడు.

కనుచూపు మేరవరకు వ్యాపించిన పూదోట బంగారు జలతారు వంటి సాయంకాలం నీరెండలో తేలిపోతూ తళతళ మెరుస్తోంది! వేర్వేరు తరులతలనుండి రంగు రంగుల పూలు నెమ్మది నెమ్మదిగా రాలి పడుతున్నాయి. గండు తుమ్మెదల ఝుంకారశ్రుతిలో పులుగుల కలకలా లొక మనోజ్ఞ గీతాలాపంలా వినవస్తున్నాయి! అతని పక్కనే ఒక తామర కొలని నీట అంచ లల్లనల్లన తేలిపోతూ చిన్నారి పూలపడవలేమో అన్న విచిత్ర విభ్రాంతి కలిగిస్తున్నాయి. ఎటువైపు చూచినా అత్యద్భుత సౌందర్యమేకాని, అతని కింకొక వికృత దృశ్యమేది ఎచ్చట కానరాలేదు!

ఇక అందాలరాశి ఆ నిండుజవ్వని మాట వేరుగా చెప్పనే అక్కరలేదు! పసినిమ్మపండు వంటి ఆమె నెమ్మేని ఛాయ ఆ పరిసరంలో అంతట పసుపు పచ్చని పుప్పొడి విరజిమ్ముతున్నది! ఉవ్వెత్తుగా ఉప్పొంగిన ఉరోజ యుగళి వల్ల వదనం కానరాక, చరణా లామె ముఖ సందర్శనంకోసం తీవ్ర తపస్సాచరిస్తున్నట్టు గోచరించాయి! చెక్కిళ్లపై ప్రతిఫలిస్తున్న కర్ణాభరణాల కాంతిలో చిరునవ్వు చిన్నారి మల్లె మొగ్గలా తరళించింది. పైటపై ముప్పేట ముత్యాలహారాలు ముఖ సౌందర్యానికి నివాళు లెత్తుతున్నాయి.

'నేను కలగంటున్నానా? లేక మేలుకునే ఉన్నానా?' అనుకుని కళ్ళు మాటిమాటికి నులుముకుని, ముక్కంటి తిరిగి ఆమె సోయగం కనుదోయి దోసిళ్లతో జుర్రుకున్నాడు. ఆ అతిలోక సౌందర్యవతి అతనివైపెంతో ఆప్యాయంగా చూస్తూ చిగురాకుల వంటి పెదవు లొకింత కదిలించబోతున్నట్టు కనిపించింది. ఇక ఆశ్చర్యం పట్టలేక ముక్కంటి నెమ్మదిగా వినబడీ వినబడనట్టు ప్రశ్నించాడు.

"అపూర్వ సౌందర్యవతీ, నీ వెవరవు? ఆ అమర లోకంనుండి దిగి వచ్చిన అప్సరవా? లేక దేవకన్యకవా? లేక నేనేమయినా కలగంటున్నానా?"




"నీవు కనుగొంటున్నది కలమాత్రం కాదు! ... అప్సరనో, దేవకన్యనో ... నే నెవరినయితే నేమి? నీకు కావలసిం దేదో నీవు కోరుకో! వెనువెంటనే నీ కా వరం ప్రసాదించగలను!"

వెయ్యి తీగల దివ్యవీణ ఏదో, ఉటాలున పైరగాలికి చలించి, గలగల మని స్వరాల ధార లొక్కమారుగా అభి వర్షించినంత ఆనందం కలిగింది ముక్కంటికి! 'ఆహా! ఎంతటి తియ్యని గాత్ర మాధుర్యము! ఎంతటి అపురూప సౌంద ర్యము! నా ఒళ్లంతా కళ్లే, వీనులే అయిపోతే ఎంత బాగుండును! ఇలాగే ఈ జవ్వని జిలిబిలి పలుకు లాలకిస్తూ ఇక్కడే నా జీవితం గడిపివెయ్య గలిగితే!' అని మాటిమాటికి తనలో తాను ఉవ్విళ్లూరిపోయాడు.

"ఎందు కలాగ వింటూపోతున్నావు! దీని కింత ఆలోచన ఎందుకు? నీకు కావలసిన వరమేదో శీఘ్రమే కోరుకో రాదా?"

జంట పిల్లనగ్రోవు లొకేమారు పిలిచి ఆర్ద్ర స్వరంతో హెచ్చరిస్తున్న ఆ గొంతు సవ్వడి వినగానే ముక్కంటి కిక శరీరంమీద స్పృహ సడలి రవంతసేపు మైమరుపు కలిగింది ... కాని మరికొన్ని క్షణాలలో ఆమె అమూల్య రత్నాభర ణాలవైపు చూడగానే అతనికి అక స్మాత్తుగా తన దుర్భర దారిద్ర్యం గుర్తు వచ్చింది. మరి తటపటాయించ కూడ దనుకున్నాడు. విచ్చలవిడిగా వెచ్చించినా ఆజీవితాంతము తరగని అఖండైశ్వర్యం వరంగా కోరుకోవాలని నిర్ణయించు కున్నాడు. కాని రెప్పపాటే లేక ఆమె అపూర్వ సౌందర్యం పరిశీలిస్తూ తన కోరిక మాటే మరిచిపోయాడు! అతని కనుదోయి కటుపిమ్మట రెప్పపాటు అలవాటే అంతరించిపోయింది! అంతలోనే అతనికి అమృతమే జాలువారు తున్నట్టు ఆ సౌందర్యరాశి కంఠస్వరం వినిపించింది.

"ఏమి, జూదరీ, మాట్లాడవు! ... నీ లోలోపలి కోరిక వెనువెంటనే బయట పెట్టరాదా? ... ఎందుకని నీ కింతటి మథన!"

ఆ మంజుల గళస్వనం విన్నంతలోనే ఆనందపారవశ్యంతో అతని కన్నుగవ అర్ధనిమీలితమై నిశ్చలమయింది!

'ఆహా! ఎంతటి తియ్యని గొంతు! ఎంతటి అతిలోక సౌందర్యము! ఈ జవ్వని నొక్కమారు అక్కున చేర్చుకో గలిగితే, ఇక కోరుకోవలసిన దేమి ఉన్నది! ఆ దేవేంద్ర వైభవం కూడా ఈ సుందరి కాలిగోటితో సరిపోలజాలదు! అంతే కాదు, ప్రపంచంలో ఈ జగన్మోహన మూర్తితో తులతూగజాలిన దేమి ఉన్నది!' అనుకున్నాడు. మరికొన్ని క్షణాలలోనే ఆ ఒయ్యారి హేలగా బొమముడి విరిచి, లీలగా, ప్రశ్నార్థ కంగా అతనివైపు చూచింది. ఇక నిగ్రహించుకోలేక మరు క్షణంలోనే ముక్కంటి అందుకున్నాడు.

"చూపుల దోసిళ్లతో నీ సొయగం జుర్రుకుంటున్నకొద్దీ నా శరీరంమీద స్పృహే సడలిపోతున్నది! కనకనే నే నింతవరకు పెదవి కదపలేకపోయాను! నీ మనోహర సౌందర్యం కన్న ఈ లోకంలో నా కిక కోరుకోవలసిన దేమి లేదు! ముమ్మాటికి నా లోలోపలి వర మిదే!"

ఆ ప్రార్థన వినగానే పట్టరాని క్రోధంతో ఆ సుందరి చెక్కిళ్లెర్ర బడ్డాయి.

"అల్పబుద్ధీ! నే నెవ్వరి ననుకుం టున్నావు! ... భ్రమరవాసినీదేవిని! తెలిసిందా? ఇటువంటి మాట నీ నోట వెలువడరాదు! నే నది వినరాదు! ... మారు మాటాడక వేరొక వర మేదయినా కోరుకో!"

ముక్కంటి అలాగే మ్రాన్పడిపోయి, మరికొన్ని క్షణాలలోనే తేరుకున్నాడు.

"అందాల పెన్నిధీ! నీ వా మాట మొట్టమొదటేవెల్లడించిఉండవచ్చునే!... అయ్యో, నీ వా భ్రమరవాసినీదేవి వని నే నెలాగ గుర్తించుకోగలను! ... నా మన స్సింక మళ్లించుకోలేను! నే నేమి చెయ్యగలను! ఏది ఏమయినా సరే, నా కింక నీ సొయగమేకాని ఇంకేది అక్కరలేదు!... నిశ్చయంగా నీ వా భ్రమరవాసినివే అయితే ఇదే వరం నా కనుగ్రహించు! లేకపోతే అన్న మాట తప్పినట్టు అంగీక రించు!...నే నిలాగే తల వంచుకుని వెళ్లి పోతాను! అంతేగాని ఇంక నీ వెటువంటి గొప్ప వరం ప్రసాదించినా అది నా కక్కర లేదు! ... అంతే! నా మాట కిక తిరుగు లేదు!"

ఆ దివ్యమూర్తి పెదవులపై చిరునగవు అలవోకగా చెంగలించింది.

"అయ్యో! ఎంతటి అజ్ఞానివి నీవు, జూదరీ! మర్త్యు లెంతటి వారయినా దివ్యుల శరీరచ్ఛాయలయినా స్పృశించ జాలరు! అట్టివాడవు నీ కోరిక నెరవేర గల దనుకున్నావా? అది ఎన్నటికి సంభ వించనేరదు! ... అయితే, నా వాగ్దానం మాత్రం వ్యర్థం కాజాలదు! ... అన్ని విధాల అందచందాలలో నన్ను పోలిన సుందరి మాత్రమే ముందుజన్మలో నీ పత్ని కాగలదు! అంతేకాదు, మొట్ట మొదటగా నీ వఖండైశ్వర్యమే వరంగా కోరుకోవా లనుకున్నావు! అదికూడా నీ కింక ముందుపుట్టుకలోనే లభించగలదు! అంతవరకు మాత్రం నీ వీ దుర్భర దారిద్ర్య యాతన అనుభవించక తప్పదు! ... పూర్వజన్మలో చేజేతులా చేసుకున్న కర్మ ఫలితం నీ వెన్నటికి తప్పించుకోలేవు!"

మరుక్షణంలోనే ఆ భ్రమరవాసినీదేవి ఆ మనోహర పరిసరాలతోబాటు అదృశ్య మయింది! అప్పటి కది తన మానసిక విభ్రాంతికాని, కలకాని కాదని ముక్కంటికి దృఢ నిశ్చయం కలిగింది. కాని, అతని మనస్సులో విపరీతమయిన దిగులు పట్టు కుని వేధించింది! 'అయ్యో! నే నా అఖం డైశ్వర్యమే కోరుకుని ఉండవలసినది! ఎంతటి పొరపాటు జరిగిపోయింది! మరి నా కీ జన్మలో లేమి పీడ తప్పదన్న మాటే! ఇక నే నింటికి పోతే మాత్రం చెయ్య గలిగినదేమి మిగిలింది!' ఉసూరుమని నిట్టూర్చాడు.

అంతలోనే అతనికి మెరుపులా ఊటా లున ఒక ఆలోచన తట్టింది! 'ఆ ముందు పుట్టుకదాకా నే నీ దారిద్ర్య యమ యాతన భరించలేను!' అనుకున్నాడు. చరచరా నడిచిపోయి ఆ పక్కనే ఉన్న ఒక కొండచరియ చేరుకున్నాడు. కిందుగా కనిపిస్తున్న ఒక పెద్ద అఘాతం వంటి లోయ వైపు చూశాడు. ఇక తన జీవిత ద్యూతంలో కట్టకడపటి పందెం వెయ్యా లనుకున్నాడు.

ఆ భ్రమరవాసిని విశ్వమోహన సౌంద ర్యంతోబాటు ఆ దేవి వాగ్దానం జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. "జయ! భ్రమరవాసినీ! జయ!" అని మూడు సారులు గొంతెత్తి అరిచి, క్షణకాలం ధ్యానించి, ఒకే ఒక్క దూకులో ఆ అఘాతంలోని కురికి, మరికొన్ని క్షణాలలోనే మరణించాడు!

మరుపటి పుట్టుకలో అతడే కాశ్మీరాధిపతి రణాదిత్య చక్రవర్తిగా జన్మించాడు. అపూర్వ దివ్య సౌందర్యశాలిని ఆ భ్రమరవాసినీదేవి అందచందాల పోలికలతో రణరంభ అన్న రాజకుమారి అతనికి రాజ్ఞి అయి, గత జన్మలో ఆ జూదరి చిట్టచివరి పందెం జేగీయ మానంగా గెలిపించింది! ★